

## రేపు భూ హక్కు పత్రాల పంపిణీ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు జిల్లాలో వైయస్సార్ జగనన్న భూహక్కు - భూ పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన జిల్లా స్థాయి కార్యక్రమం ఈ నెల 25న చిత్తూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించబడే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కె. నారాయణస్వామి, రాష్ట్ర అటవీ పర్యావరణ విద్యుత్, మైనింగ్ శాఖామాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర సాంస్కతిక పర్యాటక అభివద్ధి యువజన, టూరిజం క్రీడల మంత్రి ఆర్‌కే.రోజా లతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

# భరోసా లేని గో(పాల)మిత్రలు

### కృత్రిమ గర్భధారణ పారితోషకం పెండింగ్ / గౌరవ వేతనం ఐదారు నెలలకోసారి జమ

**ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి**

**గోపాల మిత్రల జీవితాలకు భరోసా లేకుండా పోయింది.. కృత్రిమ గర్భధారణ పారితోషకం పెండింగ్ ఉండటం, ఇచ్చే అరకొర గౌరవ వేతనం ఐదారు నెలలకోసారి జమ చేయడంతో వీరి బతుకులు దినదినగండంగా ఉన్నాయి.. సంవత్సరాల తరబడి బకాయిలు జమ కాకపోవడంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతం.**

గ్రామీణ ప్రాంతాల్లో పశు సంతతిని అభివద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న గోపాల మిత్రలకు బతుకు భరోసా లేకుండా పోతుంది. జిల్లా వ్యప్తంగా 418 మంది పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాలను వీరు సంకరజాతి పశువులను అభివద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి రూ.6500 మాత్రం గౌరవ వేతనం వస్తోంది. అదీ వస్తుందో రాదో తెలియని పరిస్థితి. మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి మాత్రమే ఇవి అందుతున్నాయి. అలాగే సంకరజాతి పశువులను వద్ధి చేయడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువుల్లో కత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని వీరు నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో భాగంగా ఒక పశువుకు గర్భధారణ సూది వేస్తే సంబంధిత రైతులు వద్ద రూ. 40 వసూలు చేస్తారు. ఈ సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం గోపాల మిత్రలకు దీన్ని తిరిగి ఇస్తూ ఉంటారు. అయితే ఇది నాలుగేళ్లుగా పెండింగ్ లోనే ఉన్నాయి. గోపాల మిత్రలు అనేక రకాలుగా ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా వీరికి రావాల్సిన గర్భధారణ పారితోషక సొమ్ములు రావడం లేదు.

అలాగే ఉమ్మడి జిల్లాలో పశు సంతతి పరిశీలన పథకం



ద్వారా పశువులకు 30 రూపాయలకే సూదులు వేస్తుంటారు. ఇలా 65 మంది గోపాల మిత్రలకు ఉపయోగం కలుగుతోంది. ఇప్పుడు ప్రభుత్వం దీనిపైన కొత్తగా మెలిక పెట్టింది. 40 రూపాయల కత్రిమ గర్భధారణ సొమ్ములు వస్తున్నాయి కావున రెండోది ఇచ్చేది లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి సొమ్ములు సంవత్సరాల తరబడి రాకపోయినా పిటిపి పథకం ద్వారా వచ్చేది ప్రతినెలా అందుతోంది. ఇప్పుడు దీన్ని తీసేయడం వల్ల తమకు ఆదాయం లేకుండా పోతుందని వచ్చే అత్తెసరు వేతనాలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రెండూ ఇవ్వాలి : టి.కీర్తనాథరెడ్డి, గోపాలమిత్రల అసోసియేషన్ కార్యదర్శి**

ఆరున్నర వేల వేతనంతో కుటుంబాలు నెట్టుకొచ్చే పరిస్థితి లేదు. పిటిపి పథకం వల్ల కొంతమంది గోపాల మిత్రులకు ఆర్థిక తోడ్పాటు అందుతోంది. ఇప్పుడు దీనిని తీసేయడం వల్ల ఇబ్బందులు వస్తాయి. ప్రభుత్వం ఆలోచించి ఈ ప్రతిపాదనను విరమించుకోవాలి.

# ఆహార ఆధారిత పరిశ్రమలకు చేయూత : డిఆర్‌ఒ

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్**



ఆహార ఆధారిత పరిశ్రమలకు బ్యాంకులు విరివిగా రుణాలు అందించి మరింత అభివద్ధి చెందేలా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. రాజశేఖర్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం డిఆర్‌ఓ సమావేశ మందిరంలో బ్యాంకర్లు వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 63 రకాల ఆహార ఆధారిత పరిశ్రమలు కుటుంబాలలో కుటుంబ సభ్యులతో నిర్వహించబడుతున్నాయని, ఈ విధంగా నిర్వహించబడే గ్రూపులకు లేదా గ్రూపుల సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తే మరింతగా వారు ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జగనన్న తోడు, వైయస్సార్ ఆసరా వంటి పథకాలు చేపట్టడం ద్వారా ఎంతగానో ఆదుకుంటున్నాయని, మరింతగా వారు వ్యాపారాన్ని అభివద్ధి చేసుకునేందుకు మరిన్ని పరిశ్రమలను ఇళ్లల్లో ఏర్పాటు చేసుకునేందుకు తగిన రుణ సహాయం అందించాలని అన్నారు. అదేవిధంగా ఆహార ఆధారిత పరిశ్రమలకు బ్రాండ్ కల్పించడానికి డిఆర్డిఏ అధికారులు కషి చేయాలని, ఆ విధంగా చేయడం ద్వారా మహిళా గ్రూపులతో తయారు చేయబడినది కాబట్టి మరింతగా కొనుగోలు చేసే వీలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం సర్వీస్ టాక్స్ లాంటివి చిన్న చిన్న వ్యాపారాలకు మినహాయింపు చేసిందని, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ వారు ఈ ప్రకటన వెల్లడించారని, అయితే వ్యాపార వ్యవహారాలకు బ్రాండింగ్ అనేది తప్పనిసరని అన్నారు. మహిళల జీవన ప్రమాణాలు పెంచితే సమాజం యొక్క జీవన ప్రమాణం పెరిగినట్లుగా ఉంటుందని, ప్రభుత్వ ఆశయాల మేరకు రుణాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి తులసి, డ్వామా పిడి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటరావు, జిల్లా సహకార అధికారి బ్రహ్మానంద రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

**హింసను అరికట్టాల్సిన బాధ్యత అందరిది**

మహిళలు, బాలికలపై హింసను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం డిఆర్‌ఒ సమావేశ హాలులో డిఆర్‌డిఏ పీడీ డిఎంకె తులసి, జడ్‌పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ విజయేంద్రరావు, డిపిఒ లక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ గిరిజన, బిసి, సంక్షేమ, వయోవృద్ధుల, పోలీసు శాఖల అధికారులతో 'లింగ ఆధారిత వివక్ష'పై జాతీయ ప్రచారంలో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ దేశంలో ఎక్కడో ఒకచోట ప్రతి 11 నిమిషాల వ్యవధిలో మహిళలు, బాలికలు, హిజ్రాలపై వివక్ష జరుగుతోందన్నారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు జిల్లాలో లైన్ డిపార్టుమెంట్ సమన్వయం చేసుకుని నెలరోజుల పాటు రోజువారీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఏ. మూర్తి, బీసీ సంక్షేమ అధికారి సుబ్రహ్మణ్యం, వయోవద్ధులు శాఖ పర్యవేక్షకులు వినోదు, జెండర్స్ ఏ పి యం, అనురాధ, స్వచ్ఛంద సంస్థ నుండి రోస్ మేరీ పాల్గొన్నారు.

## పాడి రైతులకు 'అమూల్' శుభవార్త

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

పాడి రైతులకు అమూల్ డెయిరీ శుభవార్త అందిస్తోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ చెప్పారు. జగనన్న పాల వెల్లువలో భాగంగా 24వ తేదీ గురువారం నుంచి పాల సేకరణ ధరలను అమూల్ డెయిరీ పెంచినట్లు పేర్కొన్నారు. ఆవుపాలు వెన్న శాతం బట్టి గతంలో లీటర్‌కు 30.50 రూపాయలు ఇస్తుంటే, ప్రస్తుతం 32.13 రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. లీటర్‌పై 1.63 రూపాయలు ధర పెరిగింది. అలాగే గేదెపాలు లీటర్ వెన్న శాతం బట్టి రూ.42.50 ఉంటే, ప్రస్తుతం 44.97 ఇవ్వనున్నారు. 2.47 రూపాయలు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. సంఘ నిర్వహణ ఛార్జీలు బిఎంసియు స్థాయి నాణ్యత ఆధారంగా గతంలో 7.90 రూపాయలు ఇస్తుండగా, ప్రస్తుతం 9.50 రూపాయలు ఇవ్వనున్నారు. పెరిగిన ధరలు రాయలసీమ ప్రాంతంలోని అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా ఏడాదిలో కనీసం 180 రోజులు పాలు పోసిన రైతులకు ప్రతి లీటర్‌కు అర్ధ రూపాయి బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేయనుంది. 2021లో 3,610 మంది పాడి రైతులకు 25 లక్షలు, 2022లో 6880 పాడి రైతులకు 70 లక్షలు బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం అమూల్ డెయిరీ వైఎస్ఆర్ కడప, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకు 70వేల లీటర్ల పాలసేకరణ చేస్తున్నారు.

## 'స్పందన' అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : కలెక్టర్

**చిత్తూరు అర్బన్:** స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో స్పందించాలని, సచివాలయంలలో హాజరు శాతం పెంచుకోవాలని, మ్యుటేషన్‌ల కార్యక్రమం వేగవంతంగా చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కు వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించే భాధ్యత సంబంధిత శాఖాధికారులుదే అన్నారు. సచివాల యాల్లో ఉద్యోగుల హాజరు శాతం 87 గా వుందని మరింత మెరుగు పరుచు కావాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్వే లో అందరూ సహకరించాలని, సేకరించిన ఫలితాలను ఎప్పటి కప్పుడు అప్ లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి అర్ ఓ ఎన్.రాజశేఖర్ తో పాటు జడ్పీ సీఈవో ప్రభాకర రెడ్డి, డి ఎస్ ఓ శంకరన్, డి డి వయోజన విద్య నాగేశ్వర రెడ్డి, ఈ డి మైనారిటీస్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు

**చిత్తూరు అర్బన్:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం 257 డివిజనల్ సమావేశం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా అధ్యక్షులు గోపినాథ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తా రహమద్, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా మండల కార్యవర్గం ఎన్నికయ్యింది. ఈ కార్యక్రమంలో యాదమరి మండలం నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా పీ. హెచ్ జగదీష్‌ను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యదర్శిగా కష్ణమూర్తి, కిరణ్ లను ఎన్నుకున్నారు.

# శవాన్ని కదల్చడానికి వీల్లేదు

**ఆస్తి గొడవ తేలేవరకూ...**

### మూడు రోజుల పాటు నిరీక్షణ / పెద్దల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

**ప్రజాశక్తి-కార్వేటినగరం**

ఆస్తి గొడవ తేలే వరకూ శవాన్ని తీయనిచ్చేది లేదని వారసులు పట్టుబట్టడంతో మూడు రోజుల పాటు మృతదేహం ఇంటి ముందే పడిగాపల పెట్టాల్సి వచ్చింది. చివరకు పెద్దల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి. కార్వేటినగరం తూర్పు వీధికి చెందిన గురవమందడి (80)కి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు. ఆమె మరణంతో గురవమందడి మంగమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే రెండో భార్య మంగమ్మకు ఇద్దరు కుమార్తెలు. వీరికి రెండు దశాబ్దాల క్రితమే పెళ్లయ్యింది. అయితే పెద్ద భార్య కుమారుడు మురళి అతని భార్యతో కలిసి తండ్రి ఆస్తిని పిన్నమ్మకు చెప్పకుండా తన పేరుతో రాయించుకుని కనీసం నివాస స్థలం కూడా లేకుండా చేశాడు. దీంతో కుమార్తెలు ఆస్తి తగాదాపై కోర్టుకెళ్లారు. సోమవారం గురవమందడి అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే తమకు చెందాల్సిన ఆస్తి వివాదం తెగేంత వరకూ మృతదేహాన్ని ఖననం చేయకూడదని కుమార్తెలు గొడవకు దిగారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచక మూడు రోజుల పాటు ఇంటి ముందే మృతదేహాన్ని ఉంచారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామ పెద్దల సహకారంతో బుధవారం సాయంత్రం వారికి సర్దిచెప్పి మృతదేహానిన ఖననం చేశారు.



ఆస్తి తగాదాతో మూడు రోజులుగా పడిగాపులు



## తపాలా సేవలను విస్తృతం చేయాలి

**చిత్తూరు అర్బన్:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా తపాలా కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ సూపరింటెండెంట్‌ను సిబ్బందిని అడిగి తపాలా ద్వారా అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాల సేవలను విస్తతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్ పోర్ట్ వెరిఫికేషన్ ఆఫీసర్ సాంబశివ రావు , హెడ్ పోస్ట్ ఆఫీసు పోస్ట్ మాస్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

# కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

**అంగన్‌వాడీ జిల్లా మహాసభలో వక్తలు**

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్/ తిరుపతి సిటి**

కనీస వేతనం రూన.26 వేలిచ్చేలా భవిష్యత్‌లో పోరాటాలను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు వాణీశ్రీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఉద్ఘాటించారు. తిరుపతి జిల్లా అంగన్‌వాడీ యూనియన్ మహాసభ తిరుపతిలో జిల్లా అధ్యక్షురాలు హెప్సిబా అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని పదేపదే ప్రచారం చేశారని, తీరా అధికారంలోకి వచ్చాకా పట్టించుకోవడమే మానేశారన్నారు. తెలంగాణా రాష్ట్రం కంటే అధిక వేతనాలు ఇస్తామని చెప్పి ఆచరణలో మాట తప్పారన్నారు. పోషణా ట్రాకింగ్ యాప్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌లతో విపరీతమైన పనిభారం పెంచారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో మెనూ ఛార్జీలు పెంచకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టర్లు నాశిరకమైన వస్తువులను అందిస్తే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, నోటీసులు ఇవ్వడం వేధింపు చర్యల్లో భాగమన్నారు. రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు తాళలేక వైసిపిని బలపరచినందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు గతం కంటే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం, 11 ప్రాజెక్టులకు చెందిన యూనియన్ నేతలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న యూనియన్ నాయకురాలు వాణీశ్రీ



వర్షపు నీటిని బకెట్ ద్వారా పడుతున్న వైనం


# ఆగని'వాన'... ఆస్పత్రి 'లోన'

**శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి భవనం**
**బకెట్లతో నీటిని పట్టి పారబోయాల్సిందే**
**వర్షపు నీటితో సిబ్బంది, రోగుల వ్యథలు**
**నూతన భవనానికి మోక్షం ఎపుడో..?**

**ప్రజాశక్తి - ఓజిలి**

అల్పపీడన ప్రభావం ముసురువాన మామూలే.. అయితే ఆస్పత్రి లోన కూడా ఈ అల్పపీడన ప్రభావం కనిపిస్తోంది. ఆస్పత్రి గోడలన్నీ చెమ్మతో కరెంట్ స్విచ్ వేయాలంటే భయపడే పరిస్థితి. వర్షంతో ఫ్లోరింగ్ అంతా తడిచిపోయింది. ఆస్పత్రి లోపల పొడిగా ఉన్న ప్రాంతాన్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి. భవనం శిథిలావస్థలో ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. వర్షం పడిందంటే వాతావరణ ప్రభావం రోగులు ఎక్కువగా వస్తారని, అయితే విధులు నిర్వహించాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతుందని 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుని అస్తవ్యస్తంగా మారింది. భవనం మొత్తం ఉరుస్తుండడంతో వర్షం నీటి మద్యనే సిబ్బంది నానా యాతన పడుతున్నారు. వైద్య సామగ్రి పూర్తిగా గడిచి మరమ్మతుకు గురవుతున్నాయి. కళ్లెదుటే సామగ్రి తడిచిపోతున్నా సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితి. వర్షపు నీటిని బకెట్ల ద్వారా పట్టి బయటకు పోస్తున్నారంటే దయనీయ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా రోగులకు సరైన వసతులను కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



భవనం మంజూరయ్యి రెండేళ్లవుతున్నా నూతన భవన నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. నూతన భవనం స్లాబ్ వేసి నెలలు గడుస్తున్నా గుత్తేదారుడు నిర్మాణ పనులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి భవనంలోనే అరకొర సౌకర్యాలతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో సెలైన్ ఎక్కించాలన్నా ప్రత్యేక గదులు లేక బహిరంగంగానే సెలైన్ పెట్టే పరిస్థితి ఉంది. నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# అప్పుల 'సేద్యం'

**ఏటా పెరుగుతున్న 'సాగు ఖర్చులు'**
**ఆర్బీకేల్లో దొరకని ఎరువులు, విత్తనాలు**
**పేట్రేగిపోతున్న ప్రైవేట్ దందా**
**నిద్రావస్థలో వ్యవసాయ శాఖ**

**ప్రజాశక్తి -శ్రీకాళహస్తి**

" రైతూ..రైతూ..రైతో..!! పాడుగాను నీ రాతో..!! మెతుకు మెతుకు పై నీ పేరున్నా..వెతుకులాట నీ బతుకు..చివరకు చేరుతుంది ఏ చితికో..!! నువ్వు పండించే ధాన్యమే..ఆ దేవుడి గుడిలో ప్రసాదం..!! ఆ దేవుడికెందుకు తెలియదు నీ ఇంట్లో ఉన్న విషాదం..!! కళ్ళకద్దుకొని తింటారే..నీ కన్నీళ్లు లెవరూ బాపరే..!! అంటూ ఇటీవల విడుదలైన ఓ విషాద జానపద గేయాన్ని తలపిస్తున్నాయి రైతు కష్టాలు. ప్రకతి విపత్తులను తట్టుకుని, సాగు కష్టాలను దాటుకుని, ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకు ఆపన్నహస్తం అందించేవారు కరువవుతున్నారు. పెట్టుబడి సాయం, ఇన్ పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం, ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతుండడంతో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఇప్పటికే 50 శాతం వరి నాట్లు పూర్తికావస్తున్నా రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రైతుకు భరోసా ఇస్తామన్న కేంద్రాలు(ఆర్బీకేలు) అక్కరకు రాకుండా పోతుండటం బాధాకరం.

**ఆర్బీకేల్లో దొరకని ఎరువులు, విత్తనాలు**

రబీ సీజన్‌కు సంబంధించి శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 25 నుంచి 30 వేల హెక్టార్లలో వరిని పండించడం సాధారణం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలు సమద్ధిగా కాకున్నా అవసరమైన మేరకు పడటం, అందుబాటులో తెలుగు గంగ నీళ్లు ఉండడంతో అక్టోబర్లోనే తూర్పు మండలాల రైతులు పొలంబడిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే 50 శాతం వరినట్లు పూర్తికావచ్చాయి. అయితే ఇప్పటివరకు రైతుల డిమాండుకనుగుణంగా విత్తనాలను, కాంప్లెక్స్ ఎరువులను, యూరియాను అందుబాటులో ఉంచడంలో వ్యవసాయశాఖాధికారులు విఫలమయ్యారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 90 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, 10 శాతం ఆర్బికేల్లో కూడా ఎరువులు విత్తనాలు, అందుబాటులో లేవని రైతులు మండిపడుతున్నారు. సాధారణంగా రబీకి సంబంధించి సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఇక్కడి రైతులకుంది. అయితే ఇప్పటివరకు 600 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే ఆర్బికేలకు చేరినట్లు సమాచారం. అదేవిధంగా రైతుల్లో విత్తనాల డిమాండ్ ఉన్నా ఆర్బికేల్లో సున్నా శాతం నిల్వలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్రం ఎరువుల ధరలు తగ్గించినా రైతు భరోసా కేంద్రాల్లో మాత్రం ఆన్లైన్ ధరలకంటే రూ.100 అదనంగా విక్రయిస్తున్నారన్న విమర్శలున్నాయి.

**పేట్రేగిపోతున్న ప్రైవేట్ దందా..!!**

ఒకవైపు రైతు భరోసా కేంద్రాలను ప్రోత్సహిస్తామంటున్న ప్రభుత్వం.. మరోవైపు ప్రైవేట్ ఫెర్టిలైజర్ దుకాణాలను ఎర్ర తివాచీ పరుస్తోందన్న విమర్శలున్నాయి. ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల నిల్వలు కళకళలాడుతుండడం..ఆర్బికేల్లో నిండుకుండటం ఇందుకు నిదర్శనం. దీంతో ప్రైవేట్ వ్యాపారులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను తమకిష్టమొచ్చిన ధరలకు అమ్ముకుంటూ రైతులను దగా చేస్తున్నారు. గత ఏడాది యూరియా కృత్రిమ కొరతను సష్టించి ప్రైవేట్ వ్యాపారులు రైతులను దోచుకున్న సంగతి తెలిసిందే. అయితే ప్రైవ్టేటు దుకాణాల్లో పెద్ద ఎత్తున దందా జరుగుతున్నా.. రైతులు మోసపోతున్నా వ్యవసాయశాఖాధికారులు నిద్ర నటిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



**ఏటేటా ఎరువుల ధరలు భారం**

| | 2020 | 2021 | 2022 |
|---|---|---|---|
| యూరియా | రూ.220 | రూ.260 | రూ.300 |
| 20-20-013 (కాంప్లెక్స్) | రూ.వెయ్యి | రూ.1400 | రూ.1350 |
| డీఏపీ | రూ.వెయ్యి | రూ.1350 | రూ.1400 |
| పొటాస్ (ఎంవోపీ) | రూ. 800 | రూ.900 | రూ.1700 |
| 10-26-26 | రూ.వెయ్యి | రూ.1250 | రూ.1470 |
| 15-15-15 | రూ.వెయ్యి | రూ.1150 | రూ.1500 |

**బీడు పెట్టలేకే వ్యవసాయం**

**నాగరాజు, రైతు, మన్నవరం**



ఆరుగాలం కష్టపడి వరి పండించినా మిగిలేదేమీ లేదు. పొలాన్ని బీడు పెట్టలేకే కష్టమైనా పంట పెడుతున్నాం. ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. పంట పండాక ధాన్యం అమ్మితే రూ.30 నుంచి రూ.40 వేలే వస్తోంది. ఆ వచ్చిన మొత్తం అప్పులకే పోగా, మూడు నెలల కష్టానికి ప్రతిఫలం సున్నా.

**ఆర్బికేలను పటిష్టపరచాలి**

**పెనగడం గురవయ్య, వ్య.కా.సం నాయకుడు**

ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం లేదు. ప్రైవేట్ దుకాణాలకు టన్నుల కొద్దీ సరఫరా చేస్తున్న ప్రభుత్వం ఆర్బికెలను నిర్లక్ష్యం చేయడంలో ఆంతర్యమేంటి? ప్రైవేట్ దుకాణాల నుంచి అధికారులకు మామూళ్లు అందుతుండడం వల్లే ఇలా జరుగుతోంది.



## విద్యార్థులకు ఉత్తమ పురస్కారాలు



ప్రజాశక్తి-పెద్దపంజాణి:మండలంలోని శంకర్రాయల పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలమనేరు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ అల్లా బక్షు పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను ట్రోఫీలను స్థానిక సర్పంచ్ హరినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు. ఎల్ఐసి కార్పొరేషన్ ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు పురస్కారాలను అందించడం సంతోషించదగ్గ విషయమని విద్యార్థులు మరింత ప్రతిభ చాటేందుకు ఇలాంటి ప్రోత్సాహక బహుమతులు విద్యార్థుల్లో ప్రతిభ సాధించాలని పట్టుదల పెరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశ్వత్ నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ గ్రామ కార్యదర్శి పవన్ కుమార్,శివాజీ గ్రామ కార్యదర్శి సరోజమ్మ, ఉపసర్పంచ్ కృష్ణమూర్తి, ఎల్ఐసి అడ్వైజర్ ప్రదీప్, నాగేంద్ర, క్షేత్ర ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని



వనదుర్గాపురం గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎస్.విద్యావతి

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంపీడీవో ఎస్.విద్యావతి తెలిపారు. బుధవారం ఆమె కృష్ణ జమ్మాపురం వనదుర్గాపురం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను తీసుకుని మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిందని తెలిపారు. సచివాలయ వ్యవస్థ సక్రమంగా జరగకపోతే ఎలా అన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. మన ద్వారకాపురం సచివాలయంలో ప్రజల నుంచి ఇంతవరకు వచ్చిన సమస్యలు ఎన్ని వాటిలో ఎన్ని పరిష్కారం చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు తరచూగా పరిశీలించారు.

## ప్రభుత్వ పథకాల లబ్ధిపై అవగాహన



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని గంగనాయనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త ఇండ్లు గ్రామంలో పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, జెడ్పిటిసి కేశవులు, మండల ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూపా జైకుమార్, స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి బుధవారం కొత్త ఇండ్ల గ్రామానికి చేరుకొని జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు ఇంటింటికి చేరుకొని భాగంగా కరపత్రాలు అందజేసి ప్రజలు లబ్ధి పొందిన పథకాల గురించి తెలియజేశారు. ఇందులో భాగంగా 342 కుటుంబాలను కలిసినట్లు ఎమ్మెల్యే వెంటే గౌడ ఒక ప్రకటనలో తెలియపరిచారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తీర్థం కేశవులు, లక్ష్మనపల్లి భాదర్ భాషా, దర్శపల్లి సర్పంచ్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్ పంచాయితీ పరిధిలోని వైసీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దళిత సమర భేరిని జయప్రదం చేయండి

**గాలి భాను ప్రకాష్ పిలుపు**




ప్రజాశక్తి - నగరి : రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఆదేశానుసారం నేడు, రేపు తిరుపతిలో ఎస్వీ యూనివర్సిటీ దగ్గర నుండి ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద గల డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే దళిత సమర భేరి ర్యాలీ, సదస్సును జయప్రదం చేయాలని నగరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు గాలి భాను ప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి నియోజకవర్గంలోని రెండు మునిసిపాలిటీలు, ఐదు మండలాల దళిత సోదరులు, రాష్ట్ర కమిటీ, అనుబంధ కమిటీల దళిత నాయకులు, పార్లమెంటరీ కమిటీ, అనుబంధ కమిటీల దళిత నాయకులు, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ, అనుబంధ కమిటీల దళిత నాయకులు, అన్ని మునిసిపల్, మండలాల కమిటీలు, అనుబంధ కమిటీల దళిత నాయకులు, గ్రామ కమిటీలలో ఉన్న దళిత నాయకులు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు.



వెదురుకుప్పం : మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెంజి. వరప్రసాద్ అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి క్షత్రా ఇన్నార్ది పి.మోహన్ మురళి మాట్లాడుతూ గురువారం తిరుపతి లో యస్.వి. యూనివర్సిటీ దగ్గర గల డా.బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం వద్ద నుండి ఆర్.టి.సి. బస్ స్టాండ్ వద్ద గల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు అధ్యక్షతన జరిగే 'దళిత సమర భేరి ర్యాలీ' సమావేశం విజయవంతం చేయాలని మోహన మురళి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బి.ఎం.రవి, చిత్తూరు పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, నియోజకవర్గ ఐ టి.డి.పి కార్యదర్శి అమర్నాథ్,మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాజగోపాల్ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి యుగంధర్, సీనియర్ నాయకులు రాజయ్య, హరినాథ్, పాల్గొన్నారు.

## సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి- రేణిగుంట: మండలంలోని తూకివాకం సర్పంచ్ సిద్ధప్ప రెడ్డి మునిశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను తూకివాకం గ్రామ సచివాలయం వద్ద అలాగే మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ సచివాలయంలో కేకులు కట్ చేసి, సుమారు 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రారెడ్డిపాళెం, ఎస్ఎస్పురం, రేణిగుంట బస్టాండు తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పంచాయితీ సిబ్బంది తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పథకాలు ఇస్తున్నందుకే..

# ప్రజల్లో వైసీపీకి ఆదరణ : డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా ఇస్తున్నందునే వైసీపీ ప్రభుత్వానికి ప్రజల నుండి ఆదరణ లభిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గంగాధర నెల్లూరు మండల పరిధిలోని చిన్న వేపంజేరి పంచాయతీలో స్థానిక సర్పంచ్ రూప్సి హేమ శేఖర్ రెడ్డి, వేపంజేరి ఎంపిటిసి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న పథకాలను ప్రజలకు ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యా, వైద్య ఆరోగ్య, సామాజిక, అభివృద్ధి, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేశాక సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు సులుభతరంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ వైసీపీపై నిందలు వేస్తున్నారని



చిన్న వేపంజేరి దళిత వాడలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

అయితే ప్రజలు దీనిపై స్పందించే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసీపీకి ప్రజలు అధికారం ఇవ్వడం కోసం సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాధన్, వైసీపీ నేతలు గుణశేఖర్ రెడ్డి, దుద్దుకూరు దాముశెట్టి, వెంకటరెడ్డి, హరిబాబు, ఏకాంబరం, పెద్దారెడ్డి, రాజేంద్ర రెడ్డి, శంకర్ మొదలి, కేశవులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతంగా చేయాలి

**జిల్లా కలెక్టర్ హరి నారాయణ ఆదేశాలు**

ప్రజాశక్తి -నగరి : పారిశ్రామికవేత్తలను ఆకర్షించే విధంగా కోసల నగరంలో అప్రోచ్ రోడ్లు ఉండేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్ గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నగిరి రైల్వే గేట్ సమస్యను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు పంపాలని, కోసల నగరంలో పారిశ్రామిక వాడ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలసి నగరి మండలంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రవాడలో గృహ నిర్మాణాల పనులను పరిశీలించారు. వేగంగా ఈ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే వారికి కావాల్సిన నిర్మాణం పనులకు సంబంధించి సహకరించాలన్నారు. అనంతరం రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అండర్



బ్రిడ్జి, ఫ్లైఓవర్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోసలనగరం పారిశ్రామిక వాడను సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల అధికారులతో మాట్లాడుతూ ఫేస్ -1లో మౌలిక వసతులను వేగంగా ఏర్పాటు చేయాలని విద్యుత్, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సెకండ్ ఫేస్‌కు సంబంధించి భూ సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సృజన, పరిశ్రమల అధికారిని సుహాన ఇతర గృహ నిర్మాణ శాఖ. రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# యాజమాన్య పద్ధతిలో వరిసాగు చేయాలి

**జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ**

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : యాజమాన్య పద్ధతిలో వరిసాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో 2022-23 రబీ సీజన్‌లో వరి రైతులు పంటలో చేపట్టవలసిన మేలైన పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడిలో వరి రైతులు, భూసార పరీక్షలు చేసుకోవాలని భూమికి తగ్గట్టు పంటలను సాగు చేసుకునేందుకు మేలు రకాల విత్తనాలను ఎంచుకోవాలన్నారు. పంటలకు వ్యాధి సోకినప్పుడే రైతు భరోసా కేంద్రంలో ఉండే వ్యవసాయ అధికారి ద్వారా వ్యాధి



నివారణ కోసం మందులను తెలుసుకొని పిచికారి చేయాలని గ్రామాల్లో లభించే పేడ గొర్రెలు ఎరువు వర్మి కంపోస్ట్‌లో తయారు చేసే ఎరువులను ఉపయోగించా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శివయ్య, జిల్లా డిఆర్‌సి కో-ఆర్డినేటర్ గోపాల్, ఏడీఏ నాగపద్మిని, ఉమా ఏవోలు, లక్ష్మీప్రసన్న, వేణుగోపాల నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ విస్తరణాధికారి సాధరయ్య, ఎన్జీవో రామారావు, సిబ్బంది భువనేశ్వరి, హనీష, హబీబ్ భాషా, శ్యామల పాల్గొన్నారు.

# గ్రామ సేవకుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -యాదమరి: మండలంలోని గ్రామ సేవకుల సంఘం సిఐటియు నూతన కార్యవర్గాన్ని వీఆర్ఏలు ఎన్నుకున్నారు. బుధవారం యాదమరి తహశీల్దార్ కార్యాలయావరణంలో చిత్తూరు జిల్లా గ్రామ సేవకుల సంఘం అధ్యక్షుడు కోదండన్, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు పి.పెరుమాళ్ అధ్యక్షతన గ్రామ సేవకుల సంఘం సిఐటియు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యాదమరి మండల అధ్యక్షులుగా టీ.దేవరాజులు, కొట్టాలం గ్రామం, ప్రధాన కార్యదర్శిగా టీ.పరదేశి, చిన్నంపల్లి గ్రామం, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా చంద్ర, దిలీప్, ధనంజయ, చిట్టిబాబు, మునిరత్నం, దొరై, పార్వతి, వనిత, శశికళను, అర్పుదం, సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కోదండన్ మాట్లాడుతూ గ్రామసేవకులు చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నారని పెరిగిన



యాదమరి మండల గ్రామ సేవకుల నూతన కార్యవర్గం

ధరలకు అనుగుణంగా వీఆర్ఏల జీతాలు పెంచాలన్నారు. వీఆర్ఏ జీతాలు 26 వేలకు పెంచాలని, నామిని ఉద్యోగస్తులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, డీఏ అరియర్స్ ను వెంటనే చెల్లించాలని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం సమస్యలపై స్పందించకుంటే రానున్న రోజుల్లో ఐక్య కార్యాచరణ ఉద్యమాలు చేపట్టి సమస్య పరిష్కార దిశగా అడుగులు ముందుకేస్తామని తెలిపారు..

# ఐసీడీఎస్ కార్యాలయాన్ని తరలించకండి

**అంగన్వాడీ కార్యకర్తలు మంత్రికి వినతి**

ప్రజాశక్తి- కార్వేటినగరం: సీనియర్ ఐసీడీఎస్ కార్యాలయంగా కార్వేటినగరంలో ఉంటున్న కార్యాలయాన్ని ఆకస్మింగా నగరికి తరలించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది బుధవారం ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వాకి వినతిని అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ 1991 నుంచి పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలకు అందుబాటులో ఉంటున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఉన్నట్లుండి నగరికి తరలిస్తూ నిర్ణయం తీసుకోవడం బాధాకరం అన్నారు. కార్వేటినగరం సమితిగా ఉంటున్నప్పుటి నుంచి అన్ని ఉన్నత కార్యాలయాలైన సివిల్ సీఐ కార్యాలయం, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం, ఆటవీశాఖ కార్యాలయంతో పాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఉంటున్నాయని వాటిలో కార్వేటినగరం ఐసీడీఎస్ కార్యాలయాన్ని రెండుగా విభజించి పాలసముద్రం,



ఉప ముఖ్యమంత్రికి వినతిని అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కార్వేటినగరం సిబ్బందిని నగరిలోను, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం మండలాల సిబ్బందిని జీడీనెల్లూ ప్రాజెక్టు కింద చేర్చడం వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వినతిలో తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఉప ముఖ్యమంత్రి ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్రతో ఫోన్ ద్వారా మాట్లాడి సీనియర్ ఐసీడీస్ కార్యాలయంగా గుర్తింపు పొందిన కార్వేటినగరం కార్యాలయాన్ని అక్కడే ఉండే విధంగా చూడాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# వెస్ట్ రైల్వేస్టేషన్ రోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగకరం

**ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి**

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ ముందు నుండి క్యాంపస్ స్కూల్ వెనుక వైపు గుంట పద్మావతి హైస్కూల్ ముందు రోడ్డులో కలిసే ప్రతిపాదిత రోడ్డు రావడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి అన్నారు. పడమర రైల్వే స్టేషన్ ముందు నూతనంగా ఏర్పడే రహదారి స్థలాన్ని ఎమ్మెల్యే భూమనతో కలిసి ఎంపీ గురుమూర్తి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెస్ట్ రైల్వేస్టేషన్‌కు వెల్లే ప్రజలకు, అక్కడే వున్న రైల్వే కుటుంబాలకు, అదే విధంగా ఎస్వీ యూనివర్సిటీలో ఏదైనా పెద్ద స్థాయిలో క్రీడలు, సమా వేశాలు జరిగినప్పుడు ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయో గకరంగా ఉండేలా ఈ రహదారి నిర్మాణం ఉం టుందన్నారు. స్థానిక కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏరియా డెవెలప్‌మెంట్లో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ప్రతిపాదించిన ఈ రోడ్డును నిర్మించడం వలన వలన వెస్ట్‌రైల్వే స్టేషన్‌కి మరింత ఖ్యాతి రావడంతోబాటు ప్రజలకు చాలా సౌకర్యవంతంగా వుంటుందన్నారు.

## ఆధార్ నమోదు సేవలు ప్రారంభం

ప్రజాశక్తి -సత్యవేడు : తిరుపతి జిల్లా సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆధార్ నమోదు సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఆధార్ నమోదుపై ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎంపీడీవో విజయకుమారి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, వైసీపీ మండల నాయకుడు, మాస్టర్ స్కూల్ అధినేత చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఆధార్ కేంద్రాన్ని సందర్శించి ఆధార్ నమోదు తీరును పరిశీలించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి రమణకుమార్, సీనియర్ అసిస్టెంట్ శివయ్య, జూనియర్ అసిస్టెంట్ సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## మంత్రిని కలిసిన మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రజాశక్తి - పెద్దపంజాణి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన స్వగృహంలో బుధవారం జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి సుహెబ్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా మండల అభివృద్ధికి సహకారం అందించాలని కోరానని, సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేడు మండల మీట్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: నేడు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల మీట్ జరుగుతుందని ఎంపీడీవో భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు వార్డు మెంబర్లు ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ప్రజా సమస్యలను చర్చించి మండల అభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీడీవో కోరారు.

## ఘనంగా ప్రతిజ్ఞ దివస్‌వేడుకలు



ప్రజాశక్తి -ఐరాల : స్వేరోస్ నెట్వర్క్ ఫౌండర్ డాక్టర్..ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ జన్మదినం సందర్భంగా ఐరాల మండల కేంద్రంలో స్వేరోస్ నెట్వర్క్ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు వినోద్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు, విద్యార్థులకు ఆర్థికం, అక్షరం, ఆరోగ్యం ఇవ్వడం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. స్వేరోస్ నాయకులు యువరాజు స్వేరో, పృథ్వి, పవన్, సాయి ప్రకాష్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం చిత్తూరు జిల్లా ఏఎస్పీ పి.జగదీష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా వివిధ కేసులను గురించి ఎస్ఐ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## కొండయ్యకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎకనామెట్రిక్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి పాముల కొండయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ప్రకటనలో తెలిపారు. కొండయ్యకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల ఆర్థిక శాస్త్రం, అర్థమితీయ శాస్త్రం ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పనుల్లో అక్రమాలు లేకుండా చూసుకోవాలి :ఏపీడీ

ప్రజాశక్తి -బాలాయపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందని ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ రవికుమార్ నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్రమాలు లేకుండా చూసుకోవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. అక్రమాలు చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు స్నేహభావంగా ఉండి కూలీలకు పనులు కల్పించేందుకు ముందస్తుగా ప్రణాళిక ఏర్పాటు చేసుకొని పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరిప్రసాద్, ఈసీ సుబ్రహ్మణ్యం టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మీలో ఒకడిలా ఉంటా: మాజీ ఎమ్మెల్యే



ప్రజాశక్తి - బాలాయపల్లి: మీలో ఒకడిలా ఉంటూ మీ సమస్యల కోసం పదవి ఉన్నా లేక పోయినా పోరాటం చేసి పరిష్కార మార్గం చేపడతామని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బాలాయపల్లి మండలంలోని కడగుంట గ్రామ పంచాయితీలో మండల ఐటీడీపీ కో-ఆర్డినేటర్ బూత్ ప్రసన్నకుమార్ యాదవ్ నాన్నమ్మ కర్మక్రియల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తమ సొంత నిధులతో వెంకటగిరి పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నా మన్నారు. పల్లెల్లో నుంచి వివిధ పనులు నిమిత్తమై వెంకటగిరి పట్టణానికి వచ్చిన వారికి భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిసి నాయుడు, కడగుంట గ్రామ పంచాయతీ నాయకులు ఈశ్వరయ్య, కాగితల నాగేశ్వరావు వప్పాతోటి మస్తానయ్య, పాల్గొన్నారు.

## డాక్టర్ నరసింహులుకు పితృవియోగం

ప్రజాశక్తి -వెదురుకుప్పం : కాంగ్రెస్ పార్టీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ నరసింహులుకు పితృవియోగం కలిగింది. బుధవారం తిరుపతి సమీపంలోని చిగురువాడలో మృత దేహాన్ని సందర్శన నిమిత్తం ఉంచారు. వెదురుకుప్పం మండలం కమ్మకండ్రిగకు చెందిన జీకే నాగరాజు ఆ గ్రామానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

**పేట ధనంజయులు రెడ్డికి..:** వైసీపీ మండలాధ్యక్షుడు పేట ధనంజయులురెడ్డికి పితృవియోగం కలిగింది. అతని తండ్రి పేట హరినాథ్ రెడ్డి (73) బుధవారం కన్నుమూశారు. గురువారం ఉదయం 11 గంటలకు వెదురుకుప్పం మండలం, నల్లవెంగనపల్లి పంచాయతీ, బాలకృష్ణాపురంలోని స్వగృహంలో దహనక్రియలు జరుగుతాయని బంధువులు మీడియాకు తెలిపారు..

## నాటు సారా ఊట ధ్వంసం



ప్రజాశక్తి -పూతలపట్టు : పూతలపట్టు మండల పరిధిలోని చిన్న బండపల్లి సమీపంలో గల పాడుబడ్డ ఇటుకల బట్టీలో సారాయి ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..చిన్న బండపల్లి సమీపంలో గల పాడుబడ్డ ఇటుకల బట్టీలో సారాను అమ్ముతున్నారని రహస్య సమాచారం మేరకు పూతలపట్టు ఎస్ఐ, సిబ్బంది ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా సుమారు 30 లీటర్లు గల సారాను, 500 సారాయి ఊటను కనుగొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ముగ్గురుని అదుపులోకి తీసుకోగా ప్రధాన ముద్దాయి దూర్వాసులు పరారీలో ఉన్నట్టు తెలిపారు. త్వరలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి**



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉద్యానవ శాఖ అధికారి సాగరిక ఆధ్వర్యంలో మామిడి రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, కీటక శాస్త్రం శాస్త్రవేత్త రామయ్యల మాట్లాడుతూ మామిడి పంటలో పూత, పిందే దశలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం మామిడి పంటపై తేనె మంచుపురుగు సోకుతుందని పూతదశలో మాడుతెగులు సోకుతుందని మామిడిలో పూత ఒకేసారి రావడానికి, కాయలు సైజు రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సస్రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది, మమత, పలువురు మామిడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి అంటువ్యాధి కాదు.. నివారణే మార్గం



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: హెచ్ఐవి అంటువ్యాధి కాదు నివారణే మార్గమని కోర్స్ స్వచ్ఛంద సంస్థ సుమలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చిత్తూరు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ నాగరాజు కళాబృందం వారిచే హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై కళాజాతర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షణికావేశానికి లోనై తమ నూరేళ్ల జీవితాన్ని సుఖ వ్యాధుల పాలుచేస్తున్నారని అపరిచిత వ్యక్తులతో శారీరక సంబంధాన్ని కోరుకోకూడదని తెలియజేశారు. కళాకారులు పాటలు పాడి, నాటికను ప్రదర్శించి ప్రజలను జాగృతి పరిచారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గాయత్రి, గంగ, రాణి, ఐసిటిసి కౌన్సిలర్ శోభ రాణి, కళాకారుల బృంద నాయకులు నాగరాజు, గీతారాణి, రఘుపతి, మురళి, మునిరత్నం, అశోక్, పాల్గొన్నారు.

## విద్యుత్ దీపాలు ఏర్పాటు



ప్రజాశక్తి - కార్వేటినగరం: మండల పరిధిలోని అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఆదేశించారని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం విద్యుత్ ఏఈ రియాజ్బాషా, ఎస్.ఐ దస్తగిరి కలసి అమ్మపల్లి క్రాస్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ త్వరలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించడమే కాకుండా బస్సు కోసం వేచి ఉంటున్న వారు ఇబ్బందులు పడకుండా 'చొరవ తీసుకుంటామని జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఆయన వెంట సర్పంచ్ సుందర్రా రాజ్, నాయకులు లోకనాధనాయుడు, పురంధర్, ధనశేఖర్ వర్మ, ధన్ రాజ్. విద్యుత్ సిబ్బంది పలువురు ఉన్నారు.

## గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి నిలయం

**శ్వేతా డైరెక్టర్ ఏ. ప్రశాంతి**



ప్రజాశక్తి - క్యాంపస్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వ్యక్తిత్వ వికాసానికి ఇదే సరైన నిలయమని శ్వేతా డైరెక్టర్ ఏ.ప్రశాంతి అన్నారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహదేవమ్మ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పుస్తకాన్ని ఒక నేస్తం లాభావించి చదివినట్లయితే మన అభివృద్ధి పురోగతికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ టెక్నాలజీ పైనే ఆధారపడకుండా పుస్తకాలను చదివి తన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ బ్యాంక్ డైరెక్టర్ హేమలత లైబ్రరీ నోబుల్ ఆఫీసర్ డాక్టర్ కేపీ పద్మజ, డాక్టర్ సి భువనేశ్వరి దేవి, డాక్టర్ ఏ విద్యుల్లత, డాక్టర్ భద్రమణి, నీరజ, మమత, స్వర్ణలత, జయలక్ష్మి, సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**మహీంద్రా ఫైనాన్స్ డిఎమ్**

ప్రజాశక్తి - క్యాంపస్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మహీంద్రా ఫైనాన్స్ డిఎం విశ్వ ప్రసాద్, విష్ణు వర్ధన్ అన్నారు. స్థానిక తిరుపతిలోని వేదాంత అగ్రహారం జెడ్పీ పాఠశాలలో "నేస్తం ఫౌండేషన్" మహేంద్ర ఫైనాన్స్ సహకారంతో మొక్కలను నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహీంద్రా ఫైనాన్స్ డిఎం మాట్లాడుతూ రోజు రోజుకు నాశనం అవుతున్న పర్యావరణాన్ని మొక్కలను నాటడం ద్వారా కాపాడాలని కోరారు. ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణా బాధ్యతను తీసుకోవాలన్నారు. అప్పుడే వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. మహేంద్ర ఫైనాన్స్ ఉద్యోగులు విశ్వప్రసాద్, విష్ణువర్ధన్, హేమచంద్ర, శ్రీనాథ్, మురళి, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, పాఠశాల అధ్యాపకులు హెచ్ఎం ఉమామహేశ్వరి, శ్రీదేవి, పద్మజ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు క్విజ్ కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచి తమ ప్రతిభను చాటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎయిడ్స్ నివారణ సంస్థ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ఎస్వి ఆర్ట్స్ కాలేజీ మొదటి సంవత్సరం బిఎ విద్యార్థి సాయి అఖిల్‌కి మూడవ బహుమతి, రూ. 3500ల క్యాష్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.నారాయణమ్మ మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడాంశాలు, ఇతర సామాజిక, సేవ కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ రాజు, డాక్టర్ భీమన్న, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, అధ్యాపకులు పాల్గొని అభినందనలు తెలిపారు.